

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 17 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

మున్నేటివడిని గంభీరంగా తట్టుకుని, ఆ రాపిడికి నునుపుదేలిన బండపై కూర్చుని స్నానంచేసి ఒడ్డుకు చేరుకున్నాడు సమర్ధరాముడు. తన ప్రాతఃకాలవిధులు తీర్చుకుని బయల్దేరాడు. కొద్దిగా వెనుకగా గోపన్న, మిగిలిన శిష్యులు అనుసరించి వస్తున్నారు. ఆయన కుడిచేతిలో దండ కమండలాలు, ఎడమచేతిలో ధనుస్సు, కుడి మూపుకు అమ్ములపొది విచిత్రమైన శోభలను వెలువరిస్తున్నాయి. దత్తాత్రేయుడు, శ్రీరాముడూ కలిసిపోయి అడుగులేస్తున్నట్టు ఉన్న తనను కుతూహలంగా, భక్తిగా నమస్కరిస్తూ చూస్తున్నగ్రామస్తులను ప్రసన్నమైన దృష్టులతో చూస్తూ, చిరునవ్వులతోనే ఆశీర్వదిస్తూ కృష్ణరాయల కోటలోకి ప్రవేశించాడు సమర్ధరాముడు. తనకై ఏర్పాటుజేసిన కుటీరంలోకి వెళ్ళలేదు. నిలువెత్తునా పెరిగి జొన్నకంకుల్లాగా వెన్నులను తొడిగి పరిమళపు అలలను ఎగవేస్తున్న తులసీ బృందావనాన్ని దాటాడు. గోశాలను, అశ్వశాలను దాటాడు. తనకై వేసిన కుటీరము ముందునుండి మామిడితోటలోకి నడిచాడు. విశాలమైన ఆతోపులో ఈశాన్యదిక్కులో భారీగా వటవృక్షంలా పెరిగిన ఒంటి మామిడిచెట్టుక్రిందికి దారితీశాడు. ఆశ్చర్యంగా చూస్తూ ఆయనను అనుసరిస్తున్నారు మిగిలినవారు.

'జయజయ రఘువీర సమర్థ' అంటూ నినదిస్తూ ఆయన లోపలి అడుగుబెట్టగానే ఆసరికి సిద్ధంగా ఉన్న కృష్ణరాయలు ఆయనను అనుసరించాడు మిగిలినవారితో. ఎంచుకున్న లక్ష్యంవైపు సాగుతున్న రామబాణంలా ఆ మూలన ఉన్న మామిడిచెట్టువైపు ఆయన నడుస్తుంటే కొద్దిగా వడిగా అడుగులువేస్తూ ఆయన సమీపానికి చేరుకున్నాడు కృష్ణరాయలు. ఏదోచెప్పబోయి ఏకాగ్రతతో ఆ మామిడి చెట్టును, పరిసరాలను పరికిస్తున్నట్టున్న ఆయనను కదిలించడానికి ధైర్యం చాలక ఆగిపోయాడు. ఆ కాస్త కదలికనూ గమనించి 'పర్వాలేదు, చెప్పు'మన్నట్లు తలపంకించాడు ఆయన.

తన తండ్రిగారు అక్కడికి వచ్చి కోట నిర్మాణానికి పూనుకున్నపుడు పుట్టను తొలగిస్తున్నపుడు బయల్పడిన రెండు పెను త్రాచుపాములగురించి చెప్పాడు. ఆ అనుభవముతో ఈ మామిడి చెట్టు క్రిందున్న పుట్టను తొలగించకుండా వదిలిపెట్టిన విషయము యిప్పుడు గుర్తుకొచ్చి,

' అప్పటినుండీ ఈ మామిడిచెట్టు ఇలానే ఉంది స్వామీ! ప్రతివసంతములో కొత్తచివుళ్ళు తొడిగి తొడిగి చిన్నవటవృక్షంలా ఎదిగింది. రెండు మూడుసార్లు అద్భుతమైన కృష్ణ సర్పం ఆ పుట్టకు రాకపోకలు సాగించడం నేను కూడా చూశాను. ఎందుకు దోషం మూటగట్టుకోవడం అని దీనికి నీరు పెట్టడంకోసం కూడా ఎక్కువగా రాకుండా కట్టడి చేశాను. అయినా మిగిలిన వాటికన్నా కూడా సమృద్ధిగా ఎదుగుతూనే ఉన్నది. దివ్యంగా ఫలిస్తూనే ఉన్నది. నేనే షుమారు యాభై సంవత్సరాలుగా దీన్ని చూస్తున్నాను! యింతకాలం మామిడిచెట్టుయిలా ఉండడం జరగదు సహజంగా. అంత భయంకరమైన కృష్ణ సర్పమూ జనావాసాల్లో కనిపించదు' అని ఆగిపోయాడు. ఆయన మాటల్లోని ఆందోళనను గమనించినట్టు చిరునవ్వు నవ్వాడు. 'శేషుడున్నాడా, శేషశయనుడున్నాడా క్రిష్ణాబా?' అన్నాడు పసిపిల్లాడిని ముద్దుగా వెక్కిరిస్తున్నట్టు. తన ఆందోళనను గమనించి వెక్కిరిస్తున్నట్టు అనిపించి, పసిపిల్లాడిలానే తలతిప్పుకున్నాడు. గ్రామ పొలిమేరల్లో ఎదురైనా అనుభవము యింకా తనకు మరపుకురాలేదు అనుకున్నాడు తనకు తానే.

దట్టంగా నీడను పరుస్తున్న ఆ చెట్టుక్రింద పీఠముపై కృష్ణాజినాన్ని పరిచాడు ఒకశిష్యుడు. తూర్పుదిశగా తిరిగి కూర్చున్నాడు ఆయన. తనకు ప్రక్కగా మరొక చర్మమును పరిపించాడు గోపన్నకోసం. మహలులోనుండి తెప్పించిన విలువైన కంబళ్ళు పరిచారు పరిచారకులు, ఆయన సూచన మేరకు. అందరూ ఆసీనులైనారు.

ఆ దృశ్యము ఉషోదయపు సత్సంగం ఏర్పాటు అయినట్లుగా ఉన్నది చూడడానికి. భానుడు బయలుదేరి ఎక్కువసేపు కాలేదు. బంగారు కాంతులతో మెరిసిపోతున్న ఆకులతో వింతగా భారీగా పెరిగిన ఆ మామిడి వృక్షము వటవృక్షములా ఉన్నది. మంచుకొండల్లో మొలిచిన మార్తాండుని మహస్సులు ప్రతిఫలించి బంగారువర్ణంలో మెరిసిపోతున్న దక్షిణామూర్తిలా ఉన్నాడు సమర్థరాముడు. ప్రక్కన పినాకములా ధనుస్సు. అటూయిటూ మహర్షుల్లా గోపన్న, కృష్ణరాయలు, ఉద్ధవుడు, కళ్యాణస్వామి, గోవిందస్వామి, మాధవస్వామి, యితరులు.

దివ్యమైన ప్రాతః కాలపు సంకీర్తన ప్రారంభం చేశాడు సమర్థరాముడు. తోట తోటంతా మధురంగా ప్రతిధ్వనిస్తున్నది. అరమోడ్పు కనులతో చిటితాళాలు మ్రోగిస్తూ, చేతులతో తాళాలు వేస్తూ, గొంతులు కలిపి పాడుతూ, వాయిద్యాలు మ్రోగిస్తూ సమర్థుని గానవాహినిలో మునకలేస్తున్నారు. కేవలం వారి శరీరాలు మాత్రమే యిహలోకంలో ఉన్నాయి. మనసులు పరమాత్ముని లోకంలో.

సుకుమారమైన చేతితో మృదువుగా తొలగిస్తున్నట్లు సన్నగా ఆకులు గలగలలాడాయి సమర్థరాముని వెనుకవైపు. మెత్తని స్పర్శ నడుముమీదినుండి మెడ మీదుగా శిరస్సును మృదువుగా అమ్మలా తడుముతూ పైకి పైకి ఎగబ్రాకుతున్న అనుభూతి, కుండలినీ శక్తి చోదకమైనట్లు! ఆయన కుడి తొడను మెత్తగా ఒరుసుకుంటూ, ఎడమ తొడను చుట్టి ఒక వృత్తం పూర్తిచేసి, పీఠం నుండి తోకను నేలమీదకు వేళ్ళాడవేసి, శిరస్సుపైన మూరెడు ఎత్తున, గొడుగులా మూడడుగుల వెడల్పున పడగవిప్పింది దివ్యమైన కృష్ణసర్పం. భజన పూర్తి ఐంది. సమర్థరాముని కంఠం మౌనం వహించడంతో దివ్యమైన ప్రశాంతతో కనులుతెరిచినవారికి ఎదురుగా శరీరాలు గగుర్పొడిచేట్లుగా, ఆయన తలపై పడగవిప్పి గొడుగుపట్టినట్లు ఆ కృష్ణసర్పం కనిపించింది. ప్రసన్నవదనంతో చిరునవ్వులు చిందిస్తూ 'జయజయ రఘువీరసమర్థ' అని పలికాడు సమర్థరాముడు!

ఎప్పుడైతే వాయిద్యాల హోరు సద్దుమణిగి, అందరి చూపులూ తనపై ప్రసరించాయో 'హిస్సు'మని చిన్నగా ధ్వనిచేస్తూ కనిపించీ కనిపించనంత సున్నితంగా ఊగుతూ పడగ ఊపుతూ కలయజూసింది ఆ సర్పము. అది పుట్టలోనుండి వెలువడిన మరుక్షణంనుండీ కొమ్మల్లో దాగిన పక్షులు భయంతో అరుస్తూ పైన కొమ్మనుండి కొమ్మకు గిరికీలు కొట్టడం ప్రారంభించాయి. ఆయన కూర్చున్న భంగిమ ఎప్పుడు మారిందో తెలియలేదు ఎవరికీ, సమర్ధరాముడు పద్మాసనంలో ఉన్నాడు. ఆయన వదనం విచిత్రమైన కాంతులను వెలువరిస్తున్నది. అవ్యక్తమధురమైన బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నట్లు కనులు అరమోడ్పులైనాయి. నిశితంగా పరిశీలిస్తే తప్ప ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసములు నడుస్తున్న సంగతి తెలియదు. దీర్ఘ ఉచ్ఛ్వాసము అనంతరము అంతకన్నా రెట్టింపు కుంభనం అనంతరం అంతకన్నా రెట్టింపు సమయము నిచ్ఛ్వాసము, అలా కొద్దిసేపు. అంతే! ఆ తరువాత పూర్తిగా వాయు సంచారాన్ని, ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నిలుపు చేశాడు. గోమేదికంతో చెక్కిన సజీవ శిల్పంలా ఉన్నాడాయన యిప్పుడు. ఉద్ధవుడు, కళ్యాణుడు గమనించారు. ఆయన కుండలిని మేలుకొలిపాడు.

కుండలినీ శక్తి క్రమ క్రమంగా మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞా చక్రములను దాటుతూ సహస్రారానికి చేరుకున్నది. కనిపెట్టగలిగినవాళ్ళ కళ్ళకు ఆయన వెన్నెముక క్రిందిభాగంలో, పొత్తికడుపు క్రింద, నాభికి పైన, వక్షస్థలం మధ్యన హృదయ స్థానంలో, కంఠస్థానంలో, కనుబొమల మధ్యన చిన్న మెరుపులు వరుసగా మెరుస్తూ పైకి పాకినట్లు కనిపించింది. అదివరకు ఆ వేగుచుక్కవంటి మెరుపు ఆయా స్థానాలలో మెరిసి పైకి పాకినట్లు ఉద్ధవుడు, కళ్యాణుడు మాత్రమే చూడగలిగారు. యిప్పుడు కృష్ణరాయలు కూడా ఆ దృశ్యాన్ని చూడగలిగాడు. అంతా ఆరు రెప్పపాటుల సమయంలోనే వరుసగా లీలగా మెరిసిన ఆరు మెరుపులు, ఆరు స్థానాలలో. తన కనులకు కనిపించినది నిజమా, కేవలం భ్రమా అని ఒక నిముషం అయోమయావస్థకు గురైనాడు కృష్ణరాయలు. వెంటనే గ్రహించాడు. కుండలినీ శక్తి చోదితమై వరుసగా ఆ ఆరుస్థానాలలో ఆరు చక్రములు లీలగా దర్శనమిచ్చాయి అని. అప్పుడు ఆయన గ్రహించాడు, నిన్న ఆ దయామయుడు తనకు శక్తిపాతం చేశాడు అని, తనకు కుండలినీ యోగమార్గ ఉపదేశం జరిగింది అని. ఆనందంతో పులకలెత్తి కనులవెంట అశ్రుబిందువులు జాలువారాయి కృష్ణరాయలకు.

విశ్వమంతటి ఆకృతిని ధరించగలిగిన సర్పాకృతి కుండలినీ శక్తిది. సరిగా మూడున్నర చుట్లు చుట్టుకుని ఆ మామిడిచెట్టు చిటారు కొమ్మల ఎత్తుకు ఎదిగిన ఒక దివ్య సర్పం వటవృక్షమంత వెడల్పున పడగను విప్పి నాలుకలను సాచిన దృశ్యం కనిపించింది కృష్ణరాయలకు. విచిత్రం! ఆ దివ్య సర్పం తెల్లని వర్ణంలో ఉన్నది. నెమ్మదిగా ఊగీ ఊగనట్టు ఊగుతున్న ఆ విశాలమైన తెల్లని పడగ ఒక భారీ తెరచాపలా కన్పించింది. ఆ తెరచాపక్రింద పద్మాసనంలో కూర్చున్న సరంగులా సమర్ధరాముడు దర్శనమిస్తున్నాడు.

ముందుగా వానలో తడిసిన కమ్మని మట్టి వాసన సోకింది అందరి నాసికలకు. అనంతరము వెచ్చని అనుభూతి, శీతాకాలము నెగడువద్ద కూర్చున్నట్లు. ఆ తరువాత చల్లని మంచు జల్లు చిలుకరించిన అనుభూతి. మరుక్షణం మందపవనాలు తమ శరీరాలను స్పృశించిన అనుభూతిని పొందారు. యింతలోనే 'హ'మ్మని ఒక దివ్యనాదం అఖండముగా వినిపించింది, ఏదో దివ్యమైన తంబుర శృతిలాగా. అనంతరం ఏదో అవ్యక్తమైన మానసిక ప్రశాంతతను, చల్లని అనుభూతిని, ఆనందాన్ని పొందిన భావన కలిగింది అందరికీ. అంతే! ఆ తరువాత ఒక మధురమైన మత్తు ఆవరించింది అందరికీ. పైనుండి ఎక్కడినుండో ధారలు ధారలుగా వెన్నెల కురుస్తున్నట్లు మాటలలో చెప్పలేని అద్భుతమైన ఆనందపు మైకం కలిగింది. అలా కొద్ది నిముషాలు గడిచాయి. అనంతరం మెల్లమెల్లగా బాహ్య ప్రపంచంలోకి వచ్చారు అందరూ ఎప్పుడైతే ఆయన శరీరములో కుండలిని మేలుకుని సహస్రారానికి చేరుకున్నదో ఆయన శిరస్సుపై పడగవిప్పి ఆడుతున్న కృష్ణసర్పం మంత్రించినట్లు నిశ్చలమైపోయింది. ఆ హిస్సుమన్న ధ్వని లేదు. నాలుకలు సాచడం లేదు. చూడగలిగిన వారికి దాని కనులుకూడా మేను జలదరింపజేసే క్రూరమైన మెరుపును కోల్పోయి నిశ్చలమైనట్లు తెలుస్తుంది. విశ్వాకారమైన కుండలినీ సర్ప ప్రభావానికి ఈ కృష్ణసర్పం కుదేలయింది. ఎన్ని నిముషాలు గడిచాయో తెలియదు, అరమోడ్పు కనులతో 'అమ్మా! యిక ఎక్కడికైనా వెళ్లి విశ్రాంతి తీసుకో!

స్వామికి నీ సేవ యిక చాలు' అన్నాడు మంద్రస్వరంతో. ఆ పలుకులు పూర్తి అయ్యీ కాకమునుపే, విశ్వాసపాత్రమైన పెంపుడుజంతువులాగా పడగముడిచి, అలాగే వెనక్కు జారిపోయింది ఆ సర్పం. వెనకనున్న పుట్టను ప్రదక్షిణగా చుట్టి ఈశాన్య దిక్కున దృఢంగా నిర్మించిన వెదురు కంచెను దాటి వెళ్ళిపోయింది సరసరా, ఎఱ్ఱని ఆకాశంలో నల్లని మెరుపులా, కోదండమునుండి వెలువడిన నాగాస్త్రంలా!

చూస్తున్నవారికి ఏదో మాంత్రికలోకంలో ఉన్నట్టు గడిచిపోయింది అంతా. కొన్ని నిముషాలకు కనులు తెరిచి చూపులతోనే అందరినీ సేదదీర్చాడు సమర్ధరాముడు. జయజయ రఘువీర సమర్ధ అన్న నినదం వెలువడింది. ఆయన చూపులతో జారీచేసిన ఆజ్ఞమేరకు కళ్యాణుడు దారి చూపించగా అందరూ ఆయనకు నమస్కరించి, వెనక్కు అడుగులువేసి, అక్కడినుండి వచ్చేశారు. అందరి శరీరాలలో, ముఖాలలో విస్మయము, భయము, భక్తి కలగలిసిన గౌరవభావం కనిపిస్తున్నది. ఆయన తలపంకించి సంజ్ఞ చేయడంతో గోపన్న అక్కడే ఆగిపోయాడు. అంతవరకూ పద్మాసనములో ఉన్న సమర్ధస్వామి వీరాసనంలో ఉన్నారిప్పుడు. ఆయన ఏదో పలికినట్లు పెదవుల కదలిక కనిపించింది. గోపన్న పద్మాసనంలో ధ్యానముద్రలో కూర్చున్నాడు. తన తల్లిదండ్రులను తలచుకుని నమస్కరించుకున్నాడు స్వామి ఆజ్ఞమేరకు. తనకు శ్రీవైష్ణవమార్గ గురువైన రఘునాథ భట్టారకులవారిని తలుచుకుని, ఆయన పదములకు నమస్కరించుకున్నాడు. అంజలించి సమర్ధులవైపు చూశాడు తరువాతి నిర్దేశం కొరకు. భానుని తొలికిరణాలకు విచ్చుకున్న పద్మములా సమర్ధులవారి పెదవులు విచ్చుకున్నాయి. మకరందములా ఒక దివ్య రామమంత్రము గోపన్న చెవులకు సోకింది. తేనెబొట్లను కోరికగా, తమకంగా చప్పరిస్తున్న పాపడిలా గోపన్న పెదవులు కదిలాయి. మంత్రాన్ని నిర్దేశించిన విధంగా ఉచ్చరించాడు. మననం చేశాడు. కంచర్ల గోపన్న రామదాసుగా సార్ధక నామధేయుడైనాడు.

మహలులో పనివారిద్వారా బయటపడిందేమో బహుశా, ఈ కథ అంతా మరునాడు రచ్చబండవద్ద రక్తిగట్టించింది. స్తంభాద్రినుండి కృష్ణరాయల అశ్వశాలకు దాణా తీసుకువచ్చే సాయిబు చెవులకూ చేరింది ఈ వార్త. మరుసటి వారం సంతలో బేరసారాలకు వెళ్ళినపుడు కాలక్షేపానికి కబుర్లు చెప్తూ తన ఖాస్ దోస్తులు యిద్దరు ముగ్గురికి చెప్పాడు ఈ వింత సంఘటనను. ఉత్తరాదినుండి వచ్చిన ఎవరో బైరాగికి ముక్తివరంలో, కృష్ణరాయల కోటలో, మామిడితోటలో, యాభై అడుగుల నల్లత్రాచు పడగవిప్పి గొడుగులాగా పట్టిందట మూడురోజులపాటు విసుగూ విరామం లేకుండా! తానీషాగారి ఖైదునుండి విడుదలైన పాలవంచ తాసిల్దారు గోపన్నగారు కూడా అప్పుడు అక్కడే ఉన్నారుట! గోపన్న గారికి ఆ బైరాగి ఏదో మంత్రం కూడా నేర్పాట్‌ట! రెండురోజులతర్వాత గోల్కొండలో జరిగే పెద్ద సంతకు కొనుగోళ్లకు వెళ్ళే ఆ దోస్తులకూ దేశ విదేశాలనుండి వచ్చే బేరగాళ్ళ మెహఫిల్ లో చెప్పడానికి లాజవాబ్ కహానీ దొరికింది! అక్కడ యిక అంతా వాళ్ళదే హల్చల్, హంగామా!

## 18

మధ్యాహ్నపు పొడిగాలి అలలు అలలుగా మెల్లగా వీస్తున్నది. వెళ్ళిన హేమంతము, రాబోయే శిశిరము కలిసిపోయిన గాలి అది. సంక్రాంతి రోజులు కనుక కనుచూపుమేర ఎటుచూసినా అందమైన ముగ్గుల మధ్యలో గొబ్బియలు కనిపిస్తున్నాయి. సూర్యోదయం అయ్యేప్పటికే తీర్చిన ముగ్గులు మధ్యాహ్నపు సమయానికి వడలినా, ప్రౌఢల్లా ముద్దుగా ఉన్నాయి. ముచ్చటగా ఉన్నాయి. పుష్యమాసంలో పూసంత వేసంగి నునువెచ్చగా ఉంది. నిష్క్రమించబోతున్న హేమంతపు చిరు చల్లదనం మునిపంటితో సనసన్నగా కొరుకుతున్నది. అల్లంత దూరంలో ఉపవనంలో మహలు పరివారం భోజనాలు చేస్తున్నారు. తినేవారికీ, వడ్డించే పరిచారికలకూ అక్కడక్కడ లోగొంతుకల సరసపు విసుర్లు నడుస్తున్నాయ్. గోశాలలో యింకా బీళ్లకు వదిలే వయసురాని దూడలు గంతులేస్తున్నాయి. అంగుష్ఠ ప్రమాణం కూడా లేని చిన్ని కొమ్ములతో ఒకదాన్నొకటి సవాలు చేస్తున్నాయ్. దుడుకు దూడలు స్వేచ్ఛగా

తిరుగుతున్న నెమళ్ళను తరుముతున్నాయి. ఉండీ ఉండీ అవి తిరగబడుతుంటే మళ్ళీ వెనక్కు  చెంగులు వేస్తున్నాయి. ఆ ప్రక్కనున్న అశ్వశాలనుండి మధ్యమధ్య గుఱ్ఱాల సన్నని హేషలు ఫిర్యాదు చేస్తున్నట్లు వినిపిస్తున్నాయి. గాలితో పోటీబడి పరుగెత్తే అశ్వాలు అవి. ఊరికే నిలబడి ఉండడంతో అటూ యిటూ అసహనంగా కదులుతూ గిట్టల చప్పుళ్ళు చేస్తున్నాయి.

తన కుటీరములో శిష్యులమధ్య కొలువుదీరి ఉన్నాడు సమర్ధరాముడు. గంభీరమైన కంఠంతో ఆదేశాలు జారీ చేస్తున్నాడు. ఆ మధ్యాహ్నం సమయానికి మరికొందరు శిష్యులు చేరుకున్నారు ముక్తివరానికి. దక్షిణ భారతంలో ఉన్న మఠాలకు అన్నిటికీ అదివరకే వర్తమానం వెళ్ళడంతో ఒకరొకరే ఆయనను చేరుకుంటున్నారు. మరొక  మాసంలోపే ఛత్రపతి గోల్కొండకు వస్తున్నాడు. ఆ సంగతి యింకా గోల్కొండ తానీషావారికి, యితర అధికారులకు ధృవీకరింపబడలేదు. రేపో మాపో వారికీ తెలియజేసేముందే కావలసిన ఏర్పాట్లు మూడోకంటికి తెలియకుండా చేస్తున్నాడు సమర్ధుడు. ఒకమాసం గోల్కొండ పాలకుల అతిథిగా ఉండబోతున్నాడు ఛత్రపతి. సరీగా గత విజయదశమినాడు రాయగడ్ నుండి బయలుదేరి మార్గంలోని శత్రువులను వంచి, సామంతులుగా చేసుకుంటూ దక్షిణానికి సాగుతున్నాడు. గోల్కొండ సామ్రాజ్యములో కాలుమోపినదగ్గరినుండీ ఛత్రపతి బస జేయడానికి దారిలో అక్కడక్కడ కోటలు నిర్మాణం జరుగుతున్నాయి. ఆలయాలు పునరుద్ధరింపబడుతున్నాయి. మహాబలి ఆలయాలు క్రొత్తగా నిర్మింపబడుతున్నాయి. సుస్థిర హైందవ సామ్రాజ్యవిస్తరణ అనే యజ్ఞం జరుగుతున్నది. చత్రపతి శివాజీ ఆ యాగ కర్త. సమర్ధరాముడు బ్రహ్మ! గోల్కొండ సమీపంలో ఒకటి, పాలవంచ పరగణాలో రెండు కోటలు శరవేగంతో నిర్మాణం అవుతున్నాయి. గోల్కొండ సమీపంలో మహంకాళి పాదాలచెంత, మహేశ్వరంసమీపంలో ఒక కోట నిర్మాణం అవుతున్నది. గోల్కొండప్రభువుల అతిథిగా వస్తున్న ఛత్రపతికి విడిది ఆ కోటలోనే అని నిర్ణయించారు సమర్ధరాముడు. అటునుండి శ్రీశైలభ్రమరాంబికను దర్శించుకుని మహానందిని మంచాల యతీంద్రులను సేవించుకుని దక్షిణానికి ముందుకు సాగిపోతాడు. అదీ ప్రణాళిక.

'నిత్యోబా! ఈరోజునుండీ ధరగిరిపురంలోనే నీ బస! అక్కడికోటను సిద్ధంగా యోగ్యంగా ఉంచవలసిన బాధ్యత నీదే' అన్నాడు. ఒక్కక్షణం మౌనం. ' రథసప్తమినాటికి రథాలు తిరుగుతాయి' అన్నాడు చిరునవ్వుతో. వినయంగా తలపంకించాడు నిత్యానందుడు అనబడే ఒక శిష్యుడు. ఆయన ఆ మధ్యాహ్నానికే అక్కడికి చేరుకున్నాడు.

యిరవైనాలుగేళ్ళక్రితం మొదటిసారిగా సమర్ధుడు తెలుగునేలమీద కాలుబెట్టినపుడు ఆరుమాసాలు తెలుగునేల నాలుగుచెరగులా పర్యటించాడు. అనేక మఠాలను స్థాపించి మహాబలి హనుమంతుని సేవామార్గాన్ని బోధించాడు. అప్పుడు కృష్ణానదీతీరంలో నందిగ్రామములో నెలకొల్పిన మఠానికి నిత్యానందుడిని బాధ్యునిగా నియమించాడు.

యిప్పుడు స్తంభాద్రికి సమీపంలో ధరగిరిపురంలో జరుగుతున్న కోటనిర్మాణబాధ్యత ఆయనకు అప్పగించబడింది.

ఆశ్చర్యంగా చూశాడు గోపన్న. గోల్కొండ ఖైదునుండి బయటపడి, తన జన్మస్థలానికి చేరుకున్నపుడు కొత్తగా కోట నిర్మాణమవుతున్న సంగతి విన్నాడు. పౌరులెవరూ అటు వెళ్ళడానికి వీలు లేదు. ఆనోటా ఈనోటా తానీషావారు కోట కడుతున్నారు అని మాత్రమే వదంతులు వచ్చాయి. ఆ కోట ఛత్రపతికోసం అని యిప్పుడు తెలిసింది. రథసప్తమినాటికి కోట పూర్తిగా సిద్ధంకావాలి అని సూచించినట్లు గ్రహించాడు. ఛత్రపతి తన గ్రామానికి రాబోతున్నాడనే విషయం ఆయనకు కూడా ఎందుకో తెలియని సంతోషాన్ని, ఒకింత ఉత్సుకతను కలిగించింది. ఆటగా నవ్వాడు సమర్ధరాముడు. ఛత్రపతిని దర్శిస్తావా గోపాబా? అన్నాడు  చిలిపిగా. ఇదివరలో చూడలేదూ? అన్నాడు తనే మళ్ళీ కొంటెగా. తను ఎప్పుడు చూశాడు? తనలో తనే తర్కించుకున్నాడు గోపన్న. అదే అడగబోతుండగా మరొక శిష్యునికి ఆదేశం జారీచేశాడు సమర్ధుడు.

'భికాజీబా! మహేశ్వరం వెళ్లి దత్తాత్రేయస్వామికి, వాసుదేవస్వామికి సహకరించండి' అన్నాడు. ఒకనిముషం మౌనం తర్వాత 'శివబా యాత్రలో అది కీలకమైనస్థావరం. గోల్కొండలో ఛత్రపతిరాకను సహించలేని వ్యతిరేకులకు అది దగ్గరలో ఉన్నది' అన్నాడు సాలోచనగా. మరలా గోపన్నవైపు దృష్టిని సారించి ' ఛత్రపతిని చూసిన తరువాత చెబుదువుగాని గోపాబా! గతంలో చూసినదీ లేనిదీ' అన్నాడు. చిరునవ్వుతో తలపంకించి

నమస్కరించి శెలవు తీసుకున్నాడు గోపన్న. తనూ ధరగిరిపురం వెళ్లి, ఆ రాత్రికి అక్కడ నిదురించి మరునాడు యిల్లాలితో పాలవంచకు తిరుగు ప్రయాణం అన్న సంగతి తెలియజేశాడు. 'జయజయ రఘువీర సమర్థ!'అని ఆశీఃపూర్వకంగా అనుమతించాడు సమర్థుడు. కృష్ణరాయలు సాదరంగా వీడుకోలు పలికినవెంటనే గోపన్నవారి పల్లకీ బయలుదేరింది.

కంచర్ల గోపన్నవారు, నిత్యానందుడు, భికాజీ తమ తమ గమ్యాలకు వెళ్ళిపోయారు. సమర్థునికి తెలిపి, తన ఏలుబడిలోని గ్రామాల పర్యవేక్షణకు బయలుదేరి వెళ్ళిపోయాడు కృష్ణరాయలు. వెనుకనే ఆయన సిపాయీలు నలుగురు తమ గుఱ్ఱాలమీద అనుసరించారు. ఆయనఅశ్వం కోట గుమ్మాన్ని దాటి, గిట్టలచప్పుడు అణిగిపోయేవరకూ అది వెళ్ళినవైపే చూస్తుండిపోయిన సమర్థుడు నారాయణుడు అనే శిష్యునివైపు సాలోచనగా చూశాడు. 'నారాయణ్ బా! జమిలివాయికి వెళ్ళు. సూచీగిరిపాదంలో కడుతున్న కోటబాధ్యత నీవు చూసుకో' అన్నాడు. నారాయణుడు నమస్కరించి నిష్క్రమించాడు.

పొద్దు పడమరకు తిరుగుతున్నకొద్దీ వేగంగా పగటి వెలుతురు మందగిస్తున్నది. రంగస్థలం మీది పరదాల్లా వేగంగా తెల్లని పొగమంచు తెరలు కమ్ముకుంటున్నాయి. దూరాన కొండలమీది గిరిజనులు వేసిన మంటల పొగలు మెలికలు తిరుగుతూ ఆకాశంలోకి లేస్తున్నాయి. గోధూళి వేళ అయ్యింది. గోశాలలోకి కాపరులు తోలుకొస్తున్న గోవుల అంబారవాలు ఆందోళనగా ప్రశ్నిస్తున్నట్లున్నాయి. చెంగులు పెడుతూ తల్లులను సమీపించిన దూడల అరుపులు సమాధానాలిస్తున్నాయి. పగలంతా బిడ్డలను వదిలిన తల్లులు బిడ్డలను తనువంతా నాలుకలతో తడుముతూ లాలిస్తున్నట్లుగా సన్నగా ధ్వనులు చేస్తున్నాయి. ఆ అంబారావాలు యిప్పుడు భిన్నంగా ఉన్నాయి,సముదాయిస్తున్నట్లు, ముద్దు చేస్తూ, ముచ్చట్లు చెబుతున్నట్లు ఉన్నాయి. దూడల అరుపులు గుణుస్తున్నట్లు, అలిగి మారాం చేస్తున్నట్లు ఉన్నాయి. వందల తల్లులు, వందల సంఖ్యలో శిశువులు అలా పులకింతగా దగ్గరికి చేరుతుంటే విడదీయడానికి గోపాలకులకు వల్లమాలిన పని అవుతున్నది. కసరుతూ వారు అరుస్తున్న అరుపుల్లో కూడా ప్రేమ ధ్వనిస్తున్నది. కొష్టాలలోకి మళ్లించిన ధేనువుల మూత్రం ధారలుగా వర్షంలా కురుస్తుంటే పవిత్రమైన గోమూత్రం, గోమయంతో తడిసిన మట్టి వాసన అంతటా అలుముకుంటున్నది. వందల సంఖ్యలో ఉన్న గోవులను, దూడలను ఇక్కడినుండే చూపులతోనే ప్రేమగా తడుముతున్న సమర్థునికి శివాజీ గుర్తుకొచ్చాడు!

ఆయన కనులు వాత్సల్యభావనతో ఒక క్షణకాలం చెమర్చాయి. రెక్కలకష్టాన్ని నమ్ముకుని ఇల్లు వదిలి వెళ్ళిన బిడ్డ గుర్తుకొచ్చిన తల్లిమనసులా అయిపోయింది ఆయన అంతరంగం. పాఠకుడా! నిజమే! ఆయన సర్వసంగపరిత్యాగి! పన్నెండు సంవత్సరాల వయసులోనే యిల్లూ, తల్లీ, అన్నా వదినలు, అన్నిటినీ అందరినీ వదులుకుని ధర్మంకోసం, దేశంకోసం ప్రపంచం మీదికి బయల్దేరాడు. ఆయన వలపును గెలిచినవాడు ఛత్రపతి! ఆశ్చర్యం ఏమీ లేదు! ఆయన ధర్మం, ఛత్రపతి సౌశీల్యం! ఆయన మేనకనెరుగని విశ్వామిత్రుడు, ఛత్రపతి శ్రీరాముడు! ఆయన నారాయణుడు, ఛత్రపతి నరుడు.

ముక్తివరంలో ఆయన కాలుమోపి మూడురోజులవుతున్నది నేటికి. అంతకుముందు రెండురోజులక్రితం వర్తమానం పంపాడు ఛత్రపతికి, ఈరోజు తిరుగు వర్తమానం రావాలి. ఆలోచనలలోనే ఆయన లోచనాలు ఆకాశంలోకి నిగిడించాడు. దూర సిందూరవర్ణపు సాగరంలో చిన్ని చుక్కలా గగనంలో ఒక విహంగం ఆయన కంటబడింది. అంతకంతకూ దిగుతూ దిగుతూ అటువైపే వస్తోంది. యిప్పుడు దాని రెక్కలు, పదునైన ముక్కు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యిప్పుడు దాని కూత కూడా వుండీ వుండీ వినిపిస్తున్నది. చిరునవ్వుతో ఆయన పెదవులు విచ్చుకున్నాయి. 'రాం ప్యారీ!' అన్న పిలుపు వెలువడింది. అలాగే రెండునిముషాలు ఆకాశంలో చుట్లు తిరిగి, పరిశీలనగా ఆ ప్రాంగణమంతా కలయజూస్తూ నెమ్మదిగా దిగి, ఆయన ఎడమభుజంమీద వాలింది ఆ గ్రద్ద! అది అయన పెంపుడు గ్రద్ద, దాని పేరే 'రామ్ ప్యారీ'.

పన్నెండు సంవత్సరాల వయసులో ఇల్లు వదిలి, పన్నెండు సంవత్సరాలు గోదావరీ తీరంలో తపస్సు చేసి, మరొక పన్నెండు సంవత్సరాలు భారత దేశమంతా కాలినడకన పర్యటించి ముప్పైఆరు సంవత్సరాల వయసులో ఆయన ప్రతిష్ఠానపురం చేరుకున్నపుడు ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. కాషాయ దుస్తులలో విల్లంబులు ధరించి, కైకేయి కోరికను మన్నించిన రాముడిలా ఉన్నాడు అప్పుడాయన. అక్కడి పండితులు ఎగతాళిగా 'సన్యాసి వేషమేమిటి? ఈ ధనుర్బాణాలు ఏమిటి? ధనుర్వేదం కూడా తెలిసిన యోగివా? ఆ బాణాలు అలంకారాలా, బాణంవేయడంవచ్చునా? ' అని అడిగారు. వారికి సమాధానంగా ఆకాశంలో ఎగురుతున్న గ్రద్దకు గురిపెట్టి బాణం వేశాడు, గురితప్పని సమర్థరాముడు! బాణం దెబ్బకు నేలకు వాలింది గ్రద్ద. పండితులు స్వరం మార్చారు! 'సన్యాసివి అయి వుండికూడా అన్యాయంగా జీవ హింసచేశావు. నువ్వు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే' అన్నారు దోషిని చూస్తున్నట్లు చూస్తూ.

'ప్రాయశ్చిత్తం చేసుకుంటే, చేసిన పాపం తొలిగిపోవచ్చునేమో, ఆ పాపానికి బలైన జీవుల గతి ఏమిటి? దీని సంగతి ఏమిటి?' అన్నాడు క్రిందపడిన గ్రద్దను చూపించి. శరీరంలో దిగబడిన బాణంతో ప్రాణాలు వదిలి, రక్తపుమడుగులో నేలకు పడిపోయి ఉన్నది ఆ గ్రద్ద.

'దాని సంగతి ఏముంటుంది? నీ కారణంగా ప్రాణాలు కోల్పోయింది, దాని గతి అంతే' అన్నారు వారు.

'ఓహో! మన ధర్మశాస్త్రాలలో ఎంత క్రూరుడికైనా ముక్తి ఉన్నది కానీ, మన క్రౌర్యానికి బలైన మూగజీవులకు ముక్తి లేదన్నమాట!' అన్నాడాయన. వారు మాట్లాడలేదు, ఏవగింపుగా ఆయనను అలాగే చూస్తూ వుండిపోయారు.

క్రిందపడిన గ్రద్దను చేతిలోకి తీసుకున్నాడు ఆయన. దాని శరీరంలో దిగిన బాణాన్ని మృదువుగా బయటకు లాగాడు. దాని శరీరంలో మిగిలివున్న రక్తం బయటకు చిమ్మింది. ప్రశాంతంగా చిరునవ్వులు కురిపిస్తూ అందరినీ కలయజూశాడు. కనులు మూసుకుని 'శ్రీరామ జయరామ జయజయ రామ' అని మననం చేస్తూ మూడుసార్లు దాని శరీరాన్ని తడిమాడు. అంతే! ప్రాణం పోసుకుని కదిలి, కనులు తెరిచి, రెక్కలు అల్లల్లార్చి, ఆయన అరచేతులలో స్థిరంగా నిలిచింది అది. ఎర్రని కనులు తిప్పుతూ ఆయననే పరిశీలనగా చూసింది. దాని మెడమీది రోమాలు నిగిడాయి. రెక్కలు సాచింది శెలవు యిమ్మన్నట్లుగా. మెత్తగా దాని తలమీద నిమురుతూ 'రాంప్యారీ! రాముడి ఆట అంతా! వెళ్ళు! స్వేచ్ఛగా ఎగిరిపో!' అని దానిని ఎగురవేశాడు. ఎగిరిపోయింది! మరుక్షణం యిద్దరు పండితులు స్పృహతప్పి 'నేలమీద' పడ్డారు, మిగిలినవాళ్ళు 'ఆయనపాదాలమీద!'

పక్షంరోజులు ప్రతిష్ఠానపురంలోనే బసచేశాడు. ప్రతి సాయంత్రమూ ఆయన ఉన్న కుటీరానికి వచ్చేది అది. ప్రక్కనే ఉన్న రావిచెట్టుమీద కూర్చుని ఆయననే చూసేది. దాని యిష్టం వచ్చినపుడు ఎగిరిపోయేది. అక్కడున్నపుడే ఆయన పుట్టిన ఊరు, 'జాంబా' నుండి వచ్చిన వ్యక్తి ఒకరు ఆయనను గుర్తు పట్టాడు. ఆయన తల్లి చూపును కోల్పోయి, వృద్ధాప్యంలో ఆయననే పలవరిస్తూ దీనదశలో ఉన్నదని తెలిపాడు. తల్లికోసం ఇరవైనాలుగు సంవత్సరాల తర్వాత తను పుట్టిన గ్రామానికి బయల్దేరాడు ఆయన. కుటీరమునుండి బయటకు అడుగులేసి, రావిచెట్టు క్రిందుగా వెళ్తుంటే కొమ్మల్లో కూర్చుని తననే చూస్తున్న ఆ గ్రద్ద కనిపించింది. చిలిపిగా నవ్వుతూ ' రాంప్యారీ! అమ్మ దగ్గరకు వెళ్తున్నాను' అని చెప్పాడు. ఏమి విచిత్రం! అది నేరుగా వచ్చి ఆయన భుజం మీద వాలింది. కొన్ని నిముషాలు అలానే వుండి ఎగిరిపోయింది. ఎక్కడికో పోలేదు. నేలమీద ఆయన నడుస్తుంటే, ఆకాశంలో అది అనుసరించింది.

అది కూడా ఆయనతో జాబ్ గ్రామానికి చేరుకుంది. ఆనాటినుండి ఆయనకు మచ్చిక అయ్యింది. ఆయనకు వార్తాహరునిగా మారింది. ఆయన భక్తులందరూ దానికి సుపరిచితులు. ఆయన దాసులందరూ దానికి దేవుళ్ళు. ఢిల్లీలో మాయమైన శివాజీ జిజాబాయి ఒడిలోకి సురక్షితంగా చేరేవరకూ ఎన్ని వర్తమానాలు మోసిందని! ఎంత సేవ చేసిందని!

దాని రెక్కకు అడుగున భద్రంగా అమర్చిన చిన్ని ఉండను బయటకు తీశాడు సమర్థుడు. దాన్ని మృదువుగా తట్టి సాగనంపాడు. ఎగిరి వెళ్ళి రచ్చబండఉన్న విశాల వృక్షం మీద కూర్చుని చుట్టూ చూడసాగింది అది. పల్చని పట్టు వస్త్రం మీద అందంగా శివాజీ చేతి వ్రాతతో మరాఠీలో ఉన్నలేఖను చదువుకున్నాడు.

ఎల్బర్గా యుద్ధంలో మరాఠాసేనలు పఠానులను పరాజితులను చేశాయిట. హంబీర్ రావు నాయకత్వంలో మరాఠాలకు లొంగిపోయి చిక్కారుట హసన్ ఖాన్ మియా, అతని సోదరుడు కాసిం ఖాన్ మియా. విజయము ఆనందముతోబాటు విషాదాన్నీ మిగిల్చింది. పందొమ్మిది సంవత్సరాల పడుచు పిడుగు 'నాగోజీ జెధే' అపర అభిమన్యుడిలా పోరాడి అమరుడైనాడుట! తాత 'కాన్హోజీ జెధే' తో పోటీపడి గుఱ్ఱపు సవారీలో ఆయనను ఓడించి, ఛత్రపతిచే పురస్కారాన్ని పొందిన ముద్దు ముఖం కనులముందు మెదిలింది సమర్థుడికి. అపుడపుడే ఉదయిస్తున్న భానుడి కిరణాల్లాంటి కోర మీసాల మొలకలు మెదిలాయి మనసులో. ఆ యువకుడి ఆత్మకు శాంతినిమ్మని రాముడిని వేడుకున్నాడు మనసులో.

ఏం చూసిందో ఏమిటో, ఆందోళనతో కఠోరంగా అరుస్తూ రివ్వున వచ్చి ఆయన భుజం మీద వాలింది 'రాంప్యారీ'. మరలా గాలిలోకి ఎగిరి పడమరగా చక్కర్లు కొడుతూ అరుస్తూనే ఉన్నది. రెండు గడియలక్రితం జమీ పనులమీద వెళ్ళిన కృష్ణరాయలు నలుగురు సిపాయీలు కనులముందు మెదిలారు సమర్థుడికి. 'జయ జయ రఘువీర సమర్థా!' అంటూ రెండు నిముషాలు కనులు మూసుకున్నాడు. ఆయన ఏదో దర్శించాడు. మరుక్షణం 'ఉద్ధవా!' అని పిలిచాడు బిగ్గరగా.

మంత్రగాడిలా ఒక్క క్షణంలో ఎదుట ప్రత్యక్షమైన ఉద్ధవుడికి రెండే ముక్కలు మరాఠీలో నిర్దేశించాడు. మూడవ క్షణంలో విల్లంబులతో, కాలనాగువంటి కరవాలంతో అశ్వశాలలోని గుఱ్ఱంమీద కనిపించాడు ఉద్ధవుడు. నాలుగు గంతులతో కోట ద్వారాన్ని దాటి పడమరగా పరుగుతీసింది ఉద్ధవుడి గుఱ్ఱం. ఐదు ధనువుల దూరంలో ముందుగా ఆకాశంలో ఎగురుతూ వెళ్ళింది 'రాంప్యారీ', దారి చూపిస్తున్నట్లుగా!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS